క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



మృతి చెందిన గేదె

కెరమెరి: మండల కేంద్రంలోని కేంద్రే శ్రీనివాస్‌కు చెందిన గేదె మంగళవారం విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది. ఉదయం మేత కోసమని పొలం గట్టుకు గేదె వెళ్లగా అప్పటికే త్రీఫేజ్ విద్యుత్ వైరు తెగి నేలపై పడి ఉంది. తీగకు గేదె కాలు తగలడంతో అక్కడిక్కడే మృతి చెందింది. గేదె ఖరీదు సుమారు రూ.1.10 లక్షలు ఉంటుందని, అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించాలని రైతు కోరుతున్నాడు.

హనుమాన్ ఆలయంలో వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో గల శ్రీ అభయాంజనేయ ఆలయ మూడవ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు పాలకుర్తి విష్ణుచార్యుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామికి అభిషేకం, అర్చన చేశారు. ఆలయ ప్రాంగణంలో మహా హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో సందడి నెలకొంది. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

బీఎస్‌ఎఫ్ భద్రత దళాల అధికారులకు సత్కారం

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బందోబస్తు చర్యలు నిర్వహించడానికి బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి వచ్చిన కేంద్ర భద్రతా బలగాలను మంగళవారం బుధాగెస్ట్ హౌజ్ ఆవరణలో సత్కరించారు. బీఎస్‌ఎఫ్ జీకాయ్ , 160 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ డేవిడ్‌లాల్‌కు సీపీ తరఫున బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి శాలువా కప్పి ఆత్మీయ సత్కారం చేశారు. మెమోంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల విధుల్లో భాగంగా బీఎస్‌ఎఫ్ భద్రతా దళాలు రామగుండం బెటాలియన్‌కు వచ్చినట్లు తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అత్యంత సమర్థవంతంగా బీఎస్‌ఎఫ్ బలగాలు విధులు నిర్వర్తించాయని పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని శాంభవి కంటి ఐ విజన్ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. సింగరేణి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి 50 మంది హాజరు కాగా వీరిలో ఐదుగురికి కంటి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. వీరిని శస్త్ర చికిత్స కోసం వివిధ ఆసుపత్రులకు సిఫారసు చేశారు. ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించారు. కంటి వైద్యనిపుణుడు కొంకటి అంజయ్య పరీక్షలు చేశారు.

25 లోగా దరఖాస్తు చేసుకోవాలి

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం పొందేందుకు ఈ నెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ అనీలా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకొని హార్డ్ కాపీని కాలేజీలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

'ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి'

ఖానాపూర్: వడ్డెర కులస్తులపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వడ్డెర సంఘం సోషల్‌మీడియా రాష్ట్ర కన్వీనర్ బోసు రాము డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎస్టీలుగా ఉన్న వడ్డెరలను బీసీలో చేర్చడంతో అణచివేతకు, అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్‌లో ఒడ్డెర కులస్తులపై చేసిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

సన్మానం

ముధోల్: మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎస్.కే నజీమ్‌ను మంగళవారం మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపాటిల్ ఘనంగా సన్మానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో సోషల్‌మీడియాలో కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ముఖ్యపాత్ర పోషించినందుకు అభినందించాడు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బెజ్జంకి ముత్యంరెడ్డి, అజీజ్, దిగంబర్, అబ్దుల్‌వాజ్ పాల్గొన్నారు.

పని సరే.. పైసలేవి..!

- విద్యుత్ బిల్ కలెక్టర్లకు వేతనాలేవి..
- కమీషన్ రాక.. కడుపునిండని దుస్థితి
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



కౌటాలలోని కేంద్రంలో వినియోగదారుల కోసం బిల్ కలెక్టర్ ఎదురుచూపులు



హైదరాబాద్‌లో ధర్నా చేస్తున్న విద్యుత్ బిల్ కలెక్టర్లు (ఫైల్)

కౌటాల: విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న బిల్ కలెక్టర్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. వినియోగదారులు చెల్లించే విద్యుత్ బిల్లులపై కొంత కమీషన్ల రూపంలో వీరికి చెల్లించేవారు. ప్రత్యేకంగా వేతనాలు లేక వీరు ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం తమను విద్యుత్ సంస్థ ఉద్యోగులుగా గుర్తిస్తుందని ఆశతో ఏళ్లుగా వేచిచూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 30 మందికి పైగా బిల్ కలెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. వారికి ప్రత్యేకంగా వేతనం లేకపోవడంతో ప్రతీ బిల్లుపై కొంత కమీషన్ రూపంలో చెల్లించేవారు. పురపాలిక పరిధిలో పనిచేసే వారికి ప్రతీ ఒక్క బిల్లుపై రూ.2, మండల, గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే వారికి రూ.2.75 కమీషన్ చెల్లిస్తున్నారు. ప్రారంభంలో ప్రతి ఒక్కరికీ దాదాపుగా రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు కమీషన్ వచ్చేది. 2005 –06లో కరెంట్ బిల్లులను సైతం ఆన్‌లైన్, మీ –సేవా కేంద్రాల్లోనూ చెల్లించే వెసులుబాటు కల్పించడంతో.. ఈ కేంద్రాలకు బిల్లులు చెల్లించేందుకు వచ్చే వారి సంఖ్య తగ్గిపోయింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని అమలు చేసి 200 యూనిట్ల వరకు ఉచితమని ప్రకటించి అమలు చేస్తోంది. ఈ క్రమంలో వినియోగదారులు చెల్లించే బిల్లు రశీదులతోనే ఉపాధి పొందుతున్న వీరి కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం బిల్లు చెల్లింపు కేంద్రాలకు వచ్చేవారి సంఖ్య తగ్గుముఖం పట్టడంతో నెలకు కనీసం రూ.3 వేల నుంచి రూ.4 వేలకు మించి కమీషన్ రావడం లేదని వారు వాపోతున్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ రెవెన్యూ బిల్ కలెక్టర్లను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని గత నెలలో రాష్ట్రంలోని విద్యుత్ బిల్ కలెక్టర్లు హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించారు.

ఇవీ డిమాండ్లు..

విద్యుత్ బిల్ కలెక్టర్లుగా ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వారిలో ఐటీఐ, డిప్లమా విద్యార్హతను బట్టి స్కిల్, ఇతర విద్యార్హతలను బట్టి అన్‌స్కిల్డ్ వర్కర్లుగా విభజించి, ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించాలని విద్యుత్ బిల్ కలెక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. జీఓ 11 ప్రకారం స్కిల్ వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు. గృహజ్యోతితో ఉపాధి కోల్పోతున్న వీరికి ఈఆర్‌ఓ లేదా డీఈ కార్యాలయంలో పని చేసేందుకు అవకాశం ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. బిల్ కలెక్టర్లకు విద్యుత్ సంస్థలోనే ఉపాధి కల్పించాలని, ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలంటున్నారు. విద్యుత్‌శాఖ ఉద్యోగాల్లో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న బిల్ కలెక్టర్లకు వెయిటేజీ మార్కులు కేటాయించాలని కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



విద్యుత్ బిల్ కలెక్టర్లుగా ఏళ్లుగా పని చేస్తున్నాం. కానీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదు. వేతనాలు లేకుండా కమీషన్లపై ఆధారపడి పని చేస్తున్నాం. శాశ్వత ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నాం. బిల్ కలెక్టర్లను ఆర్టిజన్లుగా గుర్తించి రూ.25 వేల వేతనం ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

– సెల్వట్‌కార్ వినోద్‌కుమార్, కౌటాల

రూ.3వేలు కూడా రావడం లేదు



20 ఏళ్లుగా బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్నా. గృహజ్యోతి ప్రారంభానికి ముందు రూ.8 వేల నుంచి రూ.9 వేల వరకు కమీషన్ వచ్చేది. కానీ ప్రస్తుతం నెలకు రూ.3 వేలు కూడా రావడం లేదు. ఏళ్లుగా విద్యుత్ శాఖలో పనిచేస్తున్నా మా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి. – జాడి శ్రీకాంత్, కాగజ్‌నగర్

'అధైర్య పడొద్దు.. అండగా ఉంటా'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

బెజ్జూర్: మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ కార్యకర్త మెస్రం రాజారాం పెద్ద కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధైర్య పడొద్దని, అండగా ఉంటానని బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు బాలకృష్ణ, సామల తిరుపతి, బస్కు రాజ్, సంతోష్, లింగయ్య, రామయ్య, నిలేశ్, మహేష్, శ్యాంసుందర్, రమేశ్, కృష్ణ, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటెత్తిన గిరిజనం.. వెల్లివిరిసిన చైతన్యం



క్యూలైన్‌లో నర్సాపూర్ గిరిజనులు

తాండూర్: వారంతా అక్షరం ముక్కరాని అడవి బిడ్డలు. రాజ్యాంగం అంటే ఏమిటో, రాజ్యాంగంలో ఓటుకు ఉన్న విలువ ఏపాటిదో తెలియని అమాయక గిరిపుత్రులు.. అయితేనేం .. నాగరికత తెలిసినా, విద్యావంతులమని చెప్పుకునే పట్టణప్రాంత వాసుల కన్నా ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఎంతో పరిణతి చెందారు. రెక్కాడితే కాని డొక్కాడని గిరిజనులు తమ రోజువారీ పనులను పక్కన పెట్టి ఓటుపై తమకున్న నిబద్ధతను చాటుకుని స్ఫూర్తిదాయకంగా నిలిచారు తాండూర్ మండలంలోని మారుమూల గ్రామాల గిరిజనులు.

గిరిపల్లెల్లో పోటాపోటీగా...

తాండూర్ మండలం నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నర్సాపూర్, అబ్బాపూర్, బెజ్జాల, ఆసాల మాడ, గంపనపల్లి, రాముగూడెం, బాపుగూడెం, లచ్చుగూడెంతో పాటు మరో 10 చిన్నచిన్న గూడేలు ఉన్నాయి. సోమవారం జరిగిన ఎన్నికల్లో ఆయా గూడేల గిరిపుత్రులు చైతన్యవంతమైన స్ఫూర్తిని ప్రదర్శించారు. బెజ్జాల పోలింగ్ కేంద్రంలో 326 మంది ఓటర్లకు గాను 278 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. నర్సాపూర్ పోలింగ్ కేంద్రంలో 450 మంది ఓటర్లకు గాను 382 మంది ఓటర్లు ఓటు వేశారు. ఆ రెండు పోలింగ్ కేంద్రాల్లో కలిపి 85 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ శాతాన్ని పెంచడం కోసం ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయిలో చేసిన ప్ర యత్నాలు, ఓటు విలువ ఎంతటి శక్తివంతమైందో తెలియపర్చడంలో గిరిజనులు ప్రభావితమైనట్లు తెలుస్తోంది. గతానికి భిన్నంగా గిరిజనులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఓట్లు వేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

హలో వినిపిస్తుందా..!



కెరమెరి మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల ప్రజలు సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేక అవస్థలు పడుతున్నారు. గౌరీ, లేండిగూడ, బోలాపటార్, నారాయణగూడ, ఏసాపూర్, పద్మావతి, అంతాపూర్, మహరాజ్‌గూడ గ్రామాల్లో మొబైల్ నెట్‌వర్క్ లేకపోవడంతో సెల్‌ఫోన్‌లో మాట్లాడేవారు హలో వినిపిస్తుందా.. అంటూ గుట్టలు, గోడలు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి టవర్ ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – కెరమెరి

కెరమెరిలో 75.05 శాతం పోలింగ్

- అత్యధికంగా నీంగూడ
- అత్యల్పంగా ముకదంగూడలో నమోదు



కెస్లాగూడలో ఓటు వేసేందుకు క్యూలో ఓటర్లు

కెరమెరి: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్ లెక్కలపై నేతలు తలమునకలవుతున్నారు. గెలుపోటములపై బేరీజు వేసుకుంటున్నారు. పోలింగ్ సరళిని అడిగి తెలుసుకుంటున్నారు. ఏ పోలింగ్ కేంద్రంలో ఎంత శాతం పోలింగ్ జరిగింది అనే విషయాలపై వాకబు చేస్తున్నారు. మొన్నటి వరకు ప్రచారంలో బిజీగా గడిపిన నేతలు పోలింగ్ పూర్తికావడంతో ఏఏ పోలింగ్ బూత్‌లలో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయి అనే కూడికలు, తీసివేతలు చేసుకుంటున్నారు. హోటళ్లు, పాన్‌టేలాలు, కిరాణా షాపుల్లో ప్రజలు చర్చలు జరుపుతున్నారు.

నీంగూడలో వంద శాతం పోలింగ్

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 41 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో నీంగూడ పోలింగ్ కేంద్రంలో వంద శాతం పోలింగ్ జరిగింది. 168 మంది ఓటర్లు ఉండగా.. అందరూ తమ ఓటుహక్కు వినియోగించుకొని ఆదర్శంగా నిలిచారు. మండలంలో మొత్తం ఓటర్లు 23685 మంది ఉండగా, 17775 మంది ఓటేయడంతో 75.05 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో అత్యధికంగా నీంగూడలో 100శాతం పోలింగ్ జరగ్గా, అత్యల్పంగా ముకదంగూడలో 57.70 శాతం ఓటింగ్ జరిగింది. మండల కేంద్రంలోని 100, 101, 102, 103 పోలింగ్ కేంద్రాల్లో ఈసారి ఓటింగ్ పెరుగుతుందని అంచనా వేసినప్పటికీ ఆయా కేంద్రాల్లో 72శాతానికి మించి పోలింగ్ దాటలేదు. కాగా 2019 ఎన్నికల్లో 29 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ఈ సారి 41 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన కెస్లాగూడలో మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించారు. అక్కడ 74.86 శాతం ఓటింగ్ నమోదైంది. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 84శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి 9 శాతం తగ్గి 75.05 శాతం నమోదైంది.

రోడ్డుపైనే పార్కింగ్



నార్నూర్‌లోని ఎస్బీఐ వద్ద రోడ్డుకు ఇరువైపులా వాహనాలు

- తరచూ ట్రాఫిక్ సమస్యలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

నార్నూర్: మండల కేంద్రమైనప్పటికీ వాహనాల నిలుపుదల (పార్కింగ్) కోసం ఇబ్బందిగా మారింది. వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నప్పటికి పార్కింగ్‌కు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం స్థానికులకు శాపంగా తయారైంది. కొందరు వ్యాపారులు దుకాణాల ముందు ఉన్న మురుగుకాలువలను ఆక్రమించి షెడ్లు నిర్మించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో వాహనాలు రోడ్డుపై నిలపాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా రహదారి ఇరుకుగా మారి తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.

చర్యలు తీసుకోకపోవడమే కారణం..

మండల కేంద్రంలో కొత్తగా భవన, వ్యాపార సముదాయాల నిర్మించేవారు పార్కింగ్ కోసం ఇలాంటి చర్యలు తీసుకోవడం లేదు. నిబంధనల మేరకు నిర్మాణాలు చేపడితే కొంతమేర వాహనాల నిలుపుదలకు స్థలాలు ఉండేవి. భవనం ముందు కనీసం ఐదు అడుగుల ఖాళీ స్థలాన్ని వదిలిపెట్టకుండా మురుగుకాలువలకు అనుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇది యథేచ్ఛగా కొనసాగుతోంది.

రాకపోకలకు ఇబ్బంది

వ్యాపారకేంద్రాల ముందు కొంతమేరైనా స్థలం వదలకపోవడంతో స్థానిక మసీదు నుంచి గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్ కోసం తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. రోడ్లకు ఇరువైపులా బైక్‌లతోపాటు ఆటోలు, జీపులు నిలుపుతున్నారు. ప్రధాన కూడలి గాంధీచౌక్ వద్ద ఇష్టానుసారంగా వాహనాలు నిలపడంతో వివిధ పనుల నిమిత్తం మార్కెట్ వచ్చే ప్రజలు, మహిళలు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుంది. పెద్ద వాహనాలు వస్తే ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ఆటోలు, జీపులు విచ్చలవిడిగా రోడ్లపై నిలపడంతో బైక్ వెళ్లలేని పరిస్థితి. కళ్లముందే సమస్యలు ఉన్న పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్పందించాలి



నార్నూర్‌లోని ప్రధాన మార్గాల్లో పార్కింగ్ స్థలాలు లేవు. ఓ దుకాణం వద్దకు వస్తే పార్కింగ్ స్థలం లేక ఇబ్బందవుతుంది. రోడ్డు పక్కనే పార్కింగ్ చేయాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

– పేందూర్ దీపక్, జైభారత్ అధ్యక్షుడు

పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి



ప్రధాన రోడ్డు మార్గంలో ఇరువైపులా దుకాణాలు ఉండడంతో కొనుగోలుదారులు వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మరోవైపు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. గాంధీచౌక్, గాదిగూడ రోడ్డు మార్గం ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి.

– మెస్రం దేవురావు, లోకారి(కే)

చర్యలు తీసుకుంటాం



మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుపుదల చేస్తే జరిమానా విధిస్తాం. ప్రత్యేక పార్కింగ్ స్థలం కోసం ప్రయత్నం చేస్తాం.

– రవికిరణ్, ఎస్సై, నార్నూర్

ఎండుతున్న పల్లెప్రకృతి వనాలు



మాణిక్యపూర్‌లోని పల్లెప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

తిర్యాణి: గ్రామాల్లో పచ్చదనం పెంపొందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలోని మొక్కలు నిర్వహణ లేకపోవడంతో ఎండిపోతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు మొక్కలను సంరక్షించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని మాణిక్యపూర్ పల్లె ప్రకృతి వనంలో మొక్కలు పూర్తిగా ఎండిపోవడంతో స్థానికులు అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

యోగా శిక్షకుడికి ఎమ్మెల్యే ప్రశంస

భైంసాటౌన్: మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన రాటి పోతన్న అంతర్జాతీయ గుర్తింపు పొందిన యోగ శిక్షణ సంస్థ ఎస్ వ్యాస యోగ యూనివర్సిటీలో వంద రోజుల శిక్షణ పూర్తి చేసుకున్నారు. దీంతో యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ పొందగా..ఈ మేరకు ఎమ్మెల్యే రామారావుపటేల్ అభినందించారు. మంగళవారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో ఎమ్మెల్యేను కలువగా.. శాలువాతో సత్కరించారు. యూనివర్సిటీ నుంచి వచ్చిన సర్టిఫికెట్ అందజేసి అభినందించారు.

పెన్ మహోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని విన్నీ పార్టీ హాల్‌లో మంగళవారం పటేల్స్ ఎంటర్‌ప్రెన్యూర్స్ నెట్‌వర్క్ వారి పెన్ మహోత్సవ బ్రోచర్‌ను మున్నూరుకాపు సంఘ సభ్యులు ఆవిష్కరించారు. ఈనెల 25, 26 తేదీల్లో హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని రాజరాజేశ్వర కన్వెన్షన్ హాల్లో హోం లైఫ్ స్టైల్, పేషన్ ట్రేడ్ ఫెయిర్‌పై ప్రదర్శన నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే ఈ ప్రదర్శనను ఉచితంగా సందర్శించవచ్చు. సంఘం సభ్యులు సత్య, ప్రవీణ్, సుమిత్, దశరథ్ నిఖిల్, గంగాధర్, శ్రీనివాస్, పతికే ప్రదీప్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో కుమార్తె రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: డీఎంఎహెచ్‌వో నరేందర్ రాథోడ్ కుమార్తె ఖుషి రాథోడ్ తన జన్మదినం సందర్భంగా రక్తదానం చేశారు. జిల్లాకేంద్రంలోని రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం స్వచ్ఛందంగా రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఆమె ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అనంతరం సత్యసాయి నిత్యాన్నదాన సత్రంలో రోగి సహాయకులకు భోజనం వడ్డించారు. రక్తదానం చేసిన ఆమెను తండ్రి డీఎంహెచ్‌వో, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అభినందించారు. రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, కృష్ణ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

ఆదిలాబాద్‌టౌన్: సేవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. మంగళవారం సఫా బైతుల్ మాల్ ఆధ్వర్యంలో రిమ్స్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో రోగుల సహాయకుల దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ మర్రిచెట్టు హనుమాన్ ఆలయంలో మంగళవారం ఆలయ రెండో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం నుంచి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.